

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 253 | పేజీలు : 8 | వెల : రూ.2/- | బుధవారం 07 అక్టోబర్ 2026 | వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని ఇండియా బ్లాక్ డిమాండ్

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 06: 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి', 'సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి' అని డిమాండ్ చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. పార్లమెంట్‌లోని మకర్‌ద్వార్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం మిగతా2లో...

స్త్రీశక్తికి చారిత్రక మైలురాయి

- 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు
- మహిళలకు రూ.3,550 కోట్ల మేర ఆదా.. రోజుకు సగటున 24 లక్షల మంది వినియోగం
- మహిళలకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు





రవాణా రంగానికి సమగ్ర ప్రణాళిక

ఐటీఎల్‌పీ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 06: రవాణా, లాజిస్టిక్స్ రంగాల్లో పరిశోధన, ప్రణాళిక, ప్రాజెక్టుల పరిశీలన, పర్యవేక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ (ఐటీఎల్‌ఏ) ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిగతా2లో...

నైజీరియాలో కూలిన మిలిటరీ విమానం

ప్రమాదంలో 25 మంది మృతి.. ఒండో రాష్ట్రంలో ఘటన



ఇగ్బోకోడా, మన జనప్రగతి అక్టోబర్ 06: నైజీరియాలోని ఒండో రాష్ట్రంలో మిలిటరీ విమానం కుప్పకూలిన ఘటనలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. నైజీరియా వైమానిక దళానికి చెందిన ఏటీఆర్-42 విమానం బెనిన్ సిటీ నుంచి లాగోస్‌కు సాధారణ విధి నిర్వహణలో భాగంగా వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇగ్బోకోడా సమీపంలోని నావికాదళ స్థావరం వద్ద విమానం రాడార్‌తో సంబంధాలు కోల్పోయి నదీ ప్రాంతంలో కూలిపోయింది. విమానంలో ఐదుగురు సిబ్బంది, 20 మంది ప్రయాణికులు కలిపి మొత్తం 25 మంది ఉన్నట్లు నైజీరియా వైమానిక దళం వెల్లడించింది. అయితే ప్రమాదం జరిగిన వెంటనే నైజీరియా విమానయాన మంత్రి 25 మంది ప్రయాణికులు, ఏడుగురు సిబ్బందితో మిగతా2లో...



సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆపరేశ్ కుమార్

- తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న ఆయన బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 06: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు. తాజా నియామకాలతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 37కి చేరింది. జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్ 2012లో జార్ఖండ్ హైకోర్టు

మిగతా2లో...

శ్రీశైలం శరన్నవరాత్రులకు చంద్రబాబుకు ఆహ్వానం

అక్టోబర్ 11 నుంచి 20 వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



అమరావతి, మన జనప్రగతి అక్టోబర్ 06: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని దేవస్థానం అధికారులు, పాలక మండలి సభ్యులు ఆహ్వానించారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజులపాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిం చేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం ఉండవల్లి లోని సీఎం క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు, వేద పండితులు చంద్రబాబును కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు సీఎంకు వేదాశీర్వచనం అందించారు. అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటంతో పాటు మిగతా2లో...



గోరంట్లలో సొంత నిధులతో అన్న క్యాంటీన్

పేదల కడుపు నింపడమే లక్ష్యం : మంత్రి సవిత

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదు


శ్రీ సత్యసాయి జిల్లా,మన జనప్రగతి అక్టోబర్ 06: పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్లలో మంత్రి సవిత తన సొంత నిధులతో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో ఈ క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పేదలకు తక్కువ ఖర్చుతో భోజనం అందించడంతో పాటు వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లను మూసివేసి పేదలపై భారం మోపారని మంత్రి సవిత విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా2లో...

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పోరాటం

- సుప్రీంకోర్టులో అవకాశం ఉంది కాబట్టే కోర్టుకు వచ్చాం : రామ్మోహన్ నాయుడు
- బీసీలకు 16,800 పదవులు దక్కుతాయి



న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 06: ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో న్యాయపోరాటం కొనసాగిస్తోంది. రిజర్వేషన్ల కల్పనకు సుప్రీంకోర్టులో అవకాశం ఉందని, అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ అంశంపై మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి న్యాయ నిపుణులతో చర్చలు జరిపారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని మరింత జటిలం చేయకుండా పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన న్యాయపరమైన మార్గాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చే అంశంపై ఇప్పటికే అనేక రాష్ట్రాలు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. **16,800 పదవులు** బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలైతే మిగతా2లో...



ముంచుకొస్తున్న కరెంటు కష్టాలు

- పడిపోతున్న జల, పవన విద్యుదుత్పత్తి.. బొగ్గు ప్లాంట్లలో నిర్వహణ పనులు
- అదనపు విద్యుత్ కోసం కేంద్రం వైపు రాష్ట్రాలు

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 06: దేశంలోని పలు రాష్ట్రాల్లో విద్యుత్ సంక్షోభం ముదురుతోంది. జల, పవన విద్యుదుత్పత్తి తగ్గడం, కొన్ని బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లలో నిర్వహణ పనులు కొనసాగుతుండటంతో విద్యుత్ సరఫరాలో కొరత ఏర్పడింది. దీంతో రాత్రి వేళల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు పెరుగుతున్నాయి. అదనపు విద్యుత్ కోసం రాష్ట్రాలు కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నాయి. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మిగతా2లో...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

07 - 10 - 2026

స్త్రీశక్తికి చారిత్రక మైలురాయి

అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 06: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకం చారిత్రక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు చేసినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళల ఆదరణ, మాతృమూర్తుల ఆమోదంతో 'స్త్రీశక్తి' పథకం ఈ కీలక ఘనతను సాధించిందని సీఎం పేర్కొన్నారు. 2025 ఆగస్టు 15న ప్రారంభమైన 'స్త్రీశక్తి' పథకం కింద ఎంపిక చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రారంభమైన ఏడాది వ్యవధిలోనే ఉచిత ప్రయాణాల సంఖ్య 100 కోట్ల మార్కును దాటడం పథకం వినియోగాన్ని తెలియజేస్తోందని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. **మహిళలకు ఆర్థిక భారం తగ్గింపు**'స్త్రీశక్తి' పథకం వల్ల మహిళలకు ప్రయాణ ఖర్చుల భారం గణనీయంగా తగ్గిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇప్పటివరకు మహిళలు సుమారు రూ.3,550 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని తెలిపారు. ఆదా అయిన మొత్తాన్ని మహిళలు తమ పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు, భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవాలన్నదే ప్రభుత్వ ఆకాంక్షగా సీఎం వివరించారు. చదువుకునే విద్యార్థినులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే వారు, వైద్యం కోసం వెళ్లే మహిళలు, స్వయం ఉపాధి కార్యక్రమాల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లేవారికి ఈ ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగకరంగా మారిందని ప్రభుత్వం చెబుతోంది. ప్రజా రవాణా అందుబాటులోకి రావడంతో మహిళలు తమ అవసరాల కోసం మరింత స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశం ఏర్పడిందని పేర్కొంది. **రోజుకు 24 లక్షల మంది ప్రయాణం**పథకం ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారంటే 'స్త్రీశక్తి' పథకం మహిళల రోజువారీ జీవితంలో ఒక భాగంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. మహిళల విద్య, ఉద్యోగం, ఉపాధి, వైద్యం, కుటుంబ అవసరాలు తదితర కార్యక్రమాలకు ప్రయాణం తప్పనిసరి కావడంతో ఉచిత బస్సు సౌకర్యం వారి ప్రయాణ వ్యయాన్ని తగ్గించడంలో తోడ్పడుతోందని అధికారులు తెలిపారు. మహిళల చలనశీలతను పెంచడంతో పాటు కుటుంబాలపై పడే ప్రయాణ ఖర్చు భారాన్ని తగ్గించడం పథకం ప్రధాన ఉద్దేశాల్లో ఒకటిగా పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు'స్త్రీశక్తి' పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో కృషి చేస్తున్న ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మహిళలకు నిరంతరం మెరుగైన సేవలు అందేలా ఆర్టీసీ యంత్రాంగం పనిచేస్తోందని పేర్కొన్నారు. పథకాన్ని ఆదరిస్తున్న మహిళలందరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఈ పథకం అమలుకు ఆర్టీసీకి నిధులను అందిస్తోంది. అధికారిక వివరాల ప్రకారం పథకం అమలుకు ఇప్పటివరకు రూ.2,160 కోట్లు విడుదల కాగా, ప్రస్తుతం నెలకు సుమారు రూ.160 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తోంది.

'శభాష్ గాయత్రీ'.. సీఎం అభినందనలుఇదే సందర్భంగా ద్వారకా తిరుమల నిత్యాన్నదాన కేంద్రంలో మానవత్వాన్ని చాటిన గాయత్రీ అనే మహిళా సిబ్బందిని కూడా సీఎం చంద్రబాబు అభినందించారు. చేతులు లేని దివ్యాంగ భక్తుడికి ఆమె స్వయంగా అన్నం తినిపించి ఆకలి తీర్చిన ఘటనపై సీఎం స్పందించారు.దివ్యాంగ భక్తుడికి అన్నం తినిపించి సేవ చేసిన గాయత్రీ సహృదయాన్ని చంద్రబాబు ప్రశంసించారు. 'మానవ సేవే మాధవ సేవ' అనే భావనను ఆమె తన సేవ ద్వారా చాటిచెప్పారని కొనియాడారు.

సమాజంలో మానవత్వం, సేవాభావం మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందించే 'స్త్రీశక్తి' పథకం 100 కోట్లకు పైగా ప్రయాణాల మైలురాయిని చేరుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి కీలక ఘట్టంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు. మహిళల ప్రయాణ అవసరాలకు ప్రజా రవాణాను మరింత అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వారి కుటుంబాలపై ప్రయాణ ఖర్చు భారాన్ని తగ్గించడమే పథకం లక్ష్యమని తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

(మొదటి పేజీ తరువాయి)

వరకు మార్చ్ నిర్వహించారు. 'ఓట్ చోర్.. గద్దీ చోడ్' అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.ఈ మార్చ్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, సీపీఐ(ఎం) నేతలు అమ్రారామ్, జాన్ బ్రిట్టాస్, ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే, ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి మార్చ్‌ను అడ్డుకున్నారు. దీంతో ఎంపీలు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. బారికేడ్లు దాటి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరిని ఈడ్చుకెళ్లి పోలీసు వాహనాల్లోకి ఎక్కించారని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. సీపీఐ(ఎం) ఎంపీ ఎ.ఎ. రహీం గాయపడినట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. **ఓటు హక్కును కాపాడాలి**'ఎస్ఐఆర్' పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఇండియా బ్లాక్ నేతలు ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని లేదా ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరారు.సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సీఈసీ విశ్వసనీయతను కోల్పోయిందని విమర్శించారు. ఎంపీలను అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు.రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం కార్యాలయానికి కొద్దిదూరంలో ఉన్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆందోళన నేపథ్యంలో ఢిల్లీలో భారీగా పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలను మోహరించారు. పలు ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు. ఇండియా బ్లాక్ నేతలు మాత్రం తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు.

నైజీరియాలో కూలిన మిలిటరీ విమానం

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 32 మంది ఉన్నట్లు ప్రకటించారు. అనంతరం వైమానిక దళం మృతుల సంఖ్యను 25గా నిర్ధారించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.**సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు** ప్రమాదంపై నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనకు గల కారణాలను గుర్తించేందుకు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాలని వైమానిక దళాన్ని ఆదేశించారు. ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. **మూడు రోజుల జాతీయ సంతాపం** మృతులైన వైమానిక దళ సిబ్బందికి గౌరవార్థం నైజీరియాలో మూడు రోజుల జాతీయ సంతాప దినాలను ప్రకటించారు. దేశవ్యాప్తంగా జాతీయ జెండాలను సగం వరకు అవనతం చేయాలని అధ్యక్షుడు ఆదేశించారు. ప్రమాదం అనంతరం సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు, సహాయక చర్యలు చేపట్టాయి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆపరేశ్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. 2025 జూలై 19న తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్‌తో పాటు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.

రవాణా రంగానికి సమగ్ర ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఐటీఎల్‌పీ జాతీయ స్థాయిలో రవాణా, లాజిస్టిక్స్ రంగాల సమగ్ర ప్రణాళికకు కేంద్ర సంస్థగా పనిచేయనుంది. రోడ్లు, రైల్వేలు, నౌకాశ్రయాలు, షిప్పింగ్, పౌర విమానయానం, అంతర్గత జలరవాణా, తీరప్రాంత రవాణా, పట్టణ రవాణా తదితర రంగాలను అనుసంధానిస్తూ పదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలానికి జాతీయ రవాణా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనుంది.

భారీ ప్రాజెక్టులపై పర్యవేక్షణ కేంద్ర ప్రభుత్వం చేపట్టే రూ.500 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వ్యయంతో కూడిన మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఐటీఎల్‌పీ సాంకేతిక పరిశీలన నిర్వహించనుంది. ప్రాజెక్టుల అమలు సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయం చేయడంతో పాటు, పనులు పూర్తైన తర్వాత వాటి ప్రభావాన్ని కూడా అంచనా వేయనుంది. రవాణా, లాజిస్టిక్స్‌కు సంబంధించిన వివిధ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు జాతీయ రవాణా డేటా రిపాజిటరీని ఏర్పాటు చేయనున్నారు. జీఎస్‌టీఎన్ ఈ-వే బిల్లులు, ఫాస్టాగ్, వాహన్, జీపీఎస్ ఆధారిత వ్యవస్థలు, పట్టణ ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థల నుంచి సమాచారాన్ని సమీకరించి రవాణా ప్రణాళికలు, సరకు రవాణా మార్గాల విశ్లేషణకు వినియోగించనున్నారు.జాతీయ లాజిస్టిక్స్ విధానం-2022ను సమీక్షించడం, అవసరమైన మార్పులకు సూచనలు ఇవ్వడం, లాజిస్టిక్స్ రంగంలో శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం కూడా ఐటీఎల్‌పీ బాధ్యతల్లో ఉండనున్నాయి. రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడం, మల్టీమోడల్ అనుసంధానాన్ని బలోపేతం చేయడం, మౌలిక వసతుల సామర్థ్యాన్ని పెంచడం దీని ప్రధాన లక్ష్యాలుగా కేంద్రం పేర్కొంది.

ముంచుకొస్తున్న కరెంటు కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ రాష్ట్రాలు అదనపు విద్యుత్ కోరుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. వర్షపాతం తగ్గడంతో సెప్టెంబరులో గత ఏడాదితో పోలిస్తే జల విద్యుదుత్పత్తి 30 శాతం తగ్గింది. పవన విద్యుదుత్పత్తి కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సమస్య మరింత తీవ్రమైంది. **2023 తర్వాత అత్యధిక కొరత** విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని పెంచినప్పటికీ కొరత కొనసాగుతోంది. ఈ ఏడాది సెప్టెంబరులో విద్యుత్ కొరత 560 మిలియన్ కిలోవాట్ గంటలకు చేరింది. 2023 ఆగస్టు తర్వాత ఇదే అత్యధిక కొరతగా నమోదైంది. సుమారు 41 గిగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ప్లాంట్లలో ఉత్పత్తి నిలిచిపోయినట్లు గ్రిడ్ ఇండియా సమాచారం వెల్లడించింది.పగటిపూట సౌర విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ తగినంత బ్యాటరీ నిల్వలు లేకపోవడంతో సాయంత్రం, రాత్రి వేళల్లో డిమాండ్‌ను తీర్చడం కష్టమవుతోంది. పారిశ్రామిక డిమాండ్, వేడి వాతావరణం, తగ్గిన జలపవన విద్యుదుత్పత్తి, బొగ్గు ప్లాంట్ల నిర్వహణ పనులు సరఫరాడిమాండ్ మధ్య అంతరాన్ని పెంచుతున్నాయి.ఈ పరిస్థితుల్లో పగటిపూట ఉత్పత్తయ్యే సౌర విద్యుత్‌ను బ్యాటరీల్లో నిల్వ చేసి రాత్రి వినియోగించుకునే విధానాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అదనపు విద్యుత్ సరఫరా కోసం రాష్ట్రాలు కేంద్రం వైపు చూస్తున్నాయి.

అమరావతి పనుల్లో వేగం పెంచాలి

•ప్రతి నెల రూ.2 వేల కోట్ల పనులు పూర్తయ్యేలా లక్ష్యాలు •152 ప్రాజెక్టుల్లో 41 వేల మంది కార్మికులు.. ఔటర్ రింగ్ రోడ్డు పనులపై ప్రత్యేక దృష్టి



అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 06:రాజధాని అమరావతి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి శరవేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను, నిర్మాణ సంస్థలను ఆదేశించారు. అమరావతి రాజధాని అభివృద్ధి పనులపై మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు రాజధానిలో వివిధ నిర్మాణ పనులు చేపడుతున్న ఏజెన్సీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా పనుల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించి, నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లేందుకు పలు సూచనలు చేశారు.గత నెలలో అమరావతిలో నిర్మాణ సంస్థలు రూ.1,345 కోట్ల విలువైన పనులను పూర్తి చేసినట్లు సమావేశంలో అధికారులు వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ఇకపై ప్రతి నెలా కనీసం రూ.2 వేల కోట్ల విలువైన పనులు పూర్తయ్యేలా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆదేశించారు. పనుల్లో ఎక్కడైనా జాప్యం జరుగుతున్నట్లయితే అందుకు గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. **152 ప్రాజెక్టుల్లో 41 వేల మంది**రాజధాని అమరావతి పరిధిలో ప్రస్తుతం 152 ప్రాజెక్టుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రాజెక్టులపై సుమారు 41 వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు తెలిపారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపడుతున్న పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన మానవ వనరులు, యంత్రాలు, ఇతర వసతులను సమకూర్చుకుని పనులను వేగవంతం చేయాలని సీఎం సూచించారు.రాజధాని నిర్మాణంలో ఒకేసారి అనేక కీలక ప్రాజెక్టులు కొనసాగుతున్న నేపథ్యంలో వాటి మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో రాజీ లేకుండా, నిర్ణయించిన గడువుల్లోనే ప్రాజెక్టులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకునే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.**ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రత్యేక దృష్టి** అమరావతి రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును కూడా వేగంగా పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర స్థాయిలో అవసరమైన అనుమతులు, ఇతర ప్రక్రియలను వేగంగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పూర్తయితే రాజధాని ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ఊతం లభించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

పనుల పురోగతిపై సీఎం సమీక్ష సమీక్షా సమావేశంలో వివిధ నిర్మాణ సంస్థలు చేపడుతున్న పనుల ప్రస్తుత స్థితిగతులు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పనులపై ముఖ్యమంత్రి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టుల వారీగా పురోగతిని పరిశీలించి, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు అవసర మైన సూచనలు చేశారు. పనుల వేగాన్ని పెంచడంతో పాటు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

శ్రీశైలం శరన్నవరాత్రులకు చంద్రబాబుకు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

తీర్థప్రసాదాలను అందజేశారు.శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భ్రమరాంబికా అమ్మవారు ప్రతిరోజూ ఒక్కో విశేష అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో దేవస్థానం చేపడుతున్న ఏర్పాట్లపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై కూడా వివరాలు తెలుసుకున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఈవో, వేద పండితులు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆయన నివాసంలో కలిసి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాలకు హాజరుకావాలని లోకేష్‌ను కూడా వారు కోరారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక సంస్థల్లో సుమారు 16,800 పదవులు బీసీలకు దక్కే అవకాశం ఉందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇది కేవలం రాజకీయ అంశం కాదని, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.ఇదిలా ఉండగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఏపీ హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 50 శాతం రిజర్వేషన్ పరిమితి విషయంలో తగిన గణాంకాలు, ఆధారాలతో ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతోంది.బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా వైసీపీ ప్రయత్నాలు చేస్తోందని రామ్మోహన్ నాయుడు ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తోందని తెలిపారు.

గోరంట్లలో సొంత నిధులతో అన్న క్యాంటీన్

(మొదటి పేజీ తరువాయి)

నాయుడు తిరిగి అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదల కడుపు నింపుతున్నారని అన్నారు. గతంలో పెనుకొండలో కూడా తన సొంత నిధులతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి వెయ్యి రోజుల పాటు పేదలకు సేవ చేసే అవకాశం లభించిందని తెలిపారు.గోరంట్లలో కూడా సొంత నిధులతో అన్న క్యాంటీన్ ప్రారంభించడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్, ఆ పార్టీ నాయకులపై మంత్రి సవిత తీవ్ర విమర్శలు చేశారు. విధ్వంస రాజకీయాలకు స్వస్తి చెప్పి అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ చేశారు. ఏపీలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేసినా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

అంగన్వాడీ, ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలి



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 06:-అంగన్వాడీ, ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పత్తికొండలో మంగళవారం భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు.కుమ్మరిగిరి ఈశ్వర్‌రెడ్డి భవనం నుంచి ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు గోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో పాటు ప్రజారోగ్యం కోసం అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు.అంగన్వాడీలకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. జీఓ నం.5ను సవరించి హెల్పర్ల ప్రమోషన్లకు న్యాయం చేయాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులను విడుదల చేయాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మెనూ బడ్జెట్‌తో పాటు గ్యాస్ ఛార్జీలను పెంచాలని కోరారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జి పుచ్చకాయల మాడ సాంబశివరెడ్డికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాముడు, శ్రీరాములు, బి.శివశంకర్, వై.రమేష్, అంగన్వాడీ నాయకులు చిట్టెమ్మ, పద్మజ, చంద్రకళ, ధనలక్ష్మి, ఆశా జిల్లా నాయకురాలు ఈశ్వరమ్మ, పావని, స్వాతి, యమునా, ద్రాక్షాయణి, అపర్ణ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాజా మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 06:-ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న తాజా మాజీ ప్రజాప్రతినిధులు ప్రజాసేవలో కొనసాగుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మగారు సూచించారు. మంగళవారం ఉదయం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తుగ్గలి మండలానికి చెందిన తాజా మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలను పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శ్రీదేవమ్మగారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకు తీసుకెళ్లడంతో పాటు గ్రామాల అభివృద్ధిలో మాజీ ప్రజాప్రతినిధుల పాత్ర అభినందనీయమన్నారు. పదవులకు విరమణ ఉన్నా ప్రజాసేవకు లేదని, ఇకపై కూడా ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, అభ్యర్థులు అవసరమైన పన్నుల రసీదులు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఎన్ఓసీలు తదితర పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల కన్వీనర్, మండల కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఉత్సవ కార్యక్రమం



దేవనకొండ మన జనప్రగతి అక్టోబర్ 06:-ఆస్పరి ప్రాజెక్టు పరిధిలోని దేవనకొండ మండలం పల్లెదొడ్డి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివలింగమ్మ పాల్గొని చిన్నారుల బరువు, ఎదుగుదల, పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు, చిన్నారుల ఎదుగుదల పర్యవేక్షణ, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ, తల్లీబిడ్డల సంక్షేమంపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మంగమ్మ, రంగమ్మ, మదర్స్ మీటింగ్‌కు హాజరైన తల్లులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేవనకొండ, ఆస్పరి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

- కలెక్టర్‌కు వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో వినతి



దేవనకొండ మన జనప్రగతి అక్టోబర్ 06:-దేవనకొండ, ఆస్పరి మండలాలను రెండో విడత కరువు మండలాల జాబితాలో చేర్చాలని కోరుతూ ఆలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై మొదటి వారంలో కురిసిన వర్షాలు మినహా దాదాపు రెండున్నర నెలలుగా సరైన వర్షపాతం లేకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని దేవనకొండ, ఆస్పరి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు అవసరమైన సహాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ బిల్లేకల్లు వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మల్లేపల్లి రంగుడు, దేవనకొండ మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, ఆస్పరి మండల కన్వీనర్ కురువ గోవిందప్ప, సొసైటీ చైర్మన్లు సుదర్శన్, రాజశేఖర్ గౌడ్, మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ ఆటోలతో చెత్తసేకరణ మరింత పటిష్టం

- రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 06:-కర్నూలు నగరంలో ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా ఇంటింటి చెత్తసేకరణ మరింత మెరుగుపడుతోందని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. మంగళవారం వెంకటరమణ కాలనీ, జొహరాపురం రోడ్డులోని జీటీఎస్ స్టేషన్‌లను కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ ఇంటింటి చెత్తసేకరణలో 5.6 శాతం మెరుగుదల నమోదైందన్నారు. కర్నూలు నగరానికి 91 ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరు కాగా, ఇప్పటికే 40 ఆటోలు అందుబాటులోకి వచ్చాయని, మిగిలినవి ఈ నెలాఖరులోగా వస్తాయని తెలిపారు. ప్రతిరోజూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఘన వ్యర్థాల నిర్వహణ చేపడుతున్నట్లు చెప్పారు.నగరంలో ప్రతిరోజూ సుమారు 225 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని తెలిపారు. గార్గేయపురం డంప్‌యార్డులో 9.5 ఎకరాల్లో రూ.8 కోట్లతో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ ప్లాంట్ ద్వారా చెత్తను శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ చేసి పునర్వినియోగానికి అనువుగా మార్చనున్నట్లు పేర్కొన్నారు.రాబోయే మూడు నెలల్లో నగరంలో 100 శాతం ఇంటింటి చెత్తసేకరణ సాధించడమే లక్ష్యమన్నారు. ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించడంతో పాటు వీలైనంతవరకు ఇంటి వద్దే హోం కంపోస్టింగ్ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు రమణమూర్తి, డాక్టర్ ఎం.రఘు, గుర్రప్ప యాదవ్, గిరిరాజ్, పవన్‌కుమార్‌రెడ్డి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలతో వైద్య సేవలు మరింత చేరువ



రాష్ట్రవ్యాప్తంగా 267 కేంద్రాల ప్రారంభం

కర్నూలు జిల్లాలో 27 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ప్రారంభం



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 06:-ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 267 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లను మంగళవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కృష్ణా జిల్లా జనార్ధనపురం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు.ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 27 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. కర్నూలు సునయన ఆడిటోరియం నుంచి ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి,

పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్, ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు స్థానికంగానే ప్రాథమిక వైద్యం, ఆరోగ్య పరీక్షలు, వ్యాధుల ముందస్తు గుర్తింపు, చికిత్స, ఆరోగ్య అవగాహన వంటి సేవలు అందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు కలిసి జిల్లాలో ప్రారంభించిన 27 కేంద్రాలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కామేశ్వర ప్రసాద్, డీసీహెచ్ డాక్టర్ జఫ్రాల, డీటీసీవో డాక్టర్ భాస్కర్, డీఎంసీఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

• ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం • వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలన్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 06:-జిల్లాలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా జల్ జీవన్ మిషన్ పనులను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార, నీరుపారిశుద్ధ్య కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద 89 పనులు పురోగతిలో ఉన్నాయని, 70 శాతం పూర్తయిన పనులను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి 15 రోజులకు పనుల పురోగతిపై నివేదిక అందించాలని సూచించారు.అమరజీవి జలధార పథకం కింద రూ.189.51 కోట్లతో 269 పనులు మంజూరయ్యాయని తెలిపారు. నీటి వనరుల బలోపేతం, ఎత్తైన నీటి నిల్వ ట్యాంకులు, పైప్‌లైన్లు, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ల పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. కొత్త బోర్లు ఏర్పాటు చేసే ముందు శాస్త్రీయంగా నీటి లభ్యతను నిర్ధారించాలని, ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమం కింద వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణం 37 శాతం, సామూహిక పారిశుద్ధ్య సముదాయాల నిర్మాణం 58 శాతం పురోగతిలో ఉన్నాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ మనోహర్, కార్యనిర్వహణ ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను నిబద్ధతతో నిర్వహించాలి: సీడీఎంఏ సంపత్ కుమార్




తిరుపతి, మన జనప్రగతి, అక్టోబర్ 6: నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల విధులను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో ఎన్నికల విధులపై సమావేశం నిర్వహించారు.నగరపాలక సంస్థ పరిధిలో 50 వార్డులను 66 వార్డులుగా విభజించామని, 304 పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించామని కమిషనర్ ఎం. జయకృష్ణ తెలిపారు. మొత్తం 2,90,492 మంది ఓటర్లు ఉన్నారని, అన్ని పోలింగ్ కేంద్రాలకు ఆర్వోలు, ఏఆర్వోలను నియమించామని, ఎస్.వి. ఆర్ట్స్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని వివరించారు.ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది సమన్వయంతో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని సీడీఎంఏ సూచించారు. విధుల్లో పొరపాట్లు జరిగితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎస్.వి. ఆర్ట్స్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు.సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఇంజినీరింగ్, రెవెన్యూ, ఆరోగ్య శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలు,ఆశా వర్కర్ల సేవలు అభినందనీయం



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 06:-చిన్నారుల పోషణ, ఆరోగ్యం, విద్యాభివృద్ధితో పాటు గర్భిణులు, బాలింతల సంరక్షణలో అంగన్వాడీలు, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయమని మండల బీజేపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం ఎగువపేటలోని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీలు, ఆశా వర్కర్లను ఘనంగా సత్కరించారు. ప్రధాని మోదీ సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అంగన్వాడీ ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు అమర్నాథ్ శర్మ, భాస్కర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, అంగన్వాడీలు సరోజినీదేవి, తిరుపతమ్మ, ఉమాదేవి, గోపాలమ్మ, సావిత్రమ్మ, సమీరాబేగం, ఆశా వర్కర్లు ఓబులమ్మ, పద్మజ, భారతి తదితరులు పాల్గొన్నారు.

స్మశానవాటిక రహదారిలో ముళ్లపొదలు



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 06:-మండలంలోని వంతాటిపల్లె గ్రామంలో స్మశానవాటికకు వెళ్లే రహదారి ఇరువైపులా ముళ్లపొదలు విపరీతంగా పెరిగి రహదారిని కమ్మేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ముళ్లపొదలు మరింత పెరిగాయని, దీంతో రహదారి సరిగా కనిపించడం లేదని వారు తెలిపారు. తక్షణమే ముళ్లపొదలను తొలగించి రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్‌ను వివరణ కోరగా, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలపై డీఆర్ఓకు వైఎస్ఆర్‌సీపీ వినతి



కడప మన జనప్రగతి అక్టోబర్ 06:-వైఎస్సార్ జిల్లా కడపలో కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ ను కలిసి ప్రజలు, అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు పోటీ చేయుచున్న అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. నో డ్యూ సర్టిఫికెట్లు ఓటర్ల జాబితా వార్డుల వర్గీకరణ,కుల దృవీకరణ పత్రాలు త్వరగా అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి.మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ బాషా మాజీ మేయర్ పాక సురేష్ పులి సునీల్ కుమార్,నిత్యానంద రెడ్డి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ ఉమైర్ మొహమ్మద్ షఫీ.దాసరి శివప్రసాద్ షఫీ. వినోద్ కుమార. వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాల నమోదు ప్రారంభం

- 35 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా

తొండూరు, మన జనప్రగతి, అక్టోబర్ 6: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో బుధవారం నుంచి సబ్సిడీ శనగ విత్తనాల నమోదు ప్రారంభమవుతుందని మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. రబీ సీజన్‌కు 1,400 క్వింటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయని, రైతులకు 35 శాతం సబ్సిడీతో సరఫరా చేస్తామని చెప్పారు.క్వింటాల్ విత్తనాల ధర రూ.9,000 కాగా, రూ.3,150 సబ్సిడీ పోను రైతు వాటాగా రూ.5,850 చెల్లించాల్సి ఉంటుందని, ఒక బస్తా ధర రూ.1,170గా నిర్ణయించామని తెలిపారు. రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌బుక్, ఫోన్ నంబర్‌తో ఆర్ఎస్కేల్లో నమోదు చేసుకుని రైతు వాటా చెల్లించాలని సూచించారు.

వైసీపీ కార్యకర్త ఇందిరమ్మ మృతి

● సంతాపం తెలిపిన మిట్టపల్లి యదుభూషణ్ రెడ్డి



గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 06:-గాలివీడు మండలం గోరాన్చెరువు గ్రామ మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం రాజు సతీమణి, వైఎస్ఆర్సీపీ కార్యకర్త ఇందిరమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న వైఎస్ఆర్సీపీ పార్టీ గాలివీడు మండల కన్వీనర్ మిట్టపల్లి యదుభూషణ్ రెడ్డి, హుటాహుటిన వారి నివాసానికి చేరుకుని, ఇందిరమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.ఈ కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఇందిరమ్మ పార్టీ కోసం చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటాద్రి, కరుణాకర్ రెడ్డి, నల్లబతిని వెంకటరమణారెడ్డి, దివాకర్ రాజు,చంగల్ రాజు, వినోద్ రాజు,భూపతి రాజు, నాగభూషణ నాయుడు,స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు ఘన నివాళులు



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 06:-స్వాతంత్ర్య సమర యోధుడు, రేనాటి వీరుడు వడ్డె ఓబన్న వర్ధంతిని పురస్కరించుకుని రైల్వే కోడూరులో ఆయనకు ఘన నివాళులర్పించారు. వడ్డె ఓబన్న విగ్రహానికి వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, మాజీ మండల అధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ తోట శివ సాయి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేతృత్వంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో వడ్డె ఓబన్న కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం, ప్రదర్శించిన ధైర్యసాహసాలు, చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. వడ్డె ఓబన్న స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బత్తల సుబ్రమణ్యం, గోపి, బత్తల మణి, మాజీ సర్పంచులు హరికృష్ణారెడ్డి, చెంగల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుబ్రమణ్యం రాజు, మాజీ ఎంపీటీసీ ఆనంద్ యాదవ్‌తో పాటు వడ్డెర సంఘం ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని వడ్డె ఓబన్నకు నివాళులర్పించారు.

వర్షం కారణంగా దెబ్బతిన్న అరటి తోటను పరిశీలించిన ఎమ్మెల్యే



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 06:-రైల్వేకోడూరు మండలం ఓబనపల్లి గ్రామంలో సోమవారం రాత్రి అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం కారణంగా దెబ్బతిన్న అరటి తోటలు, పలు పంట పొలాలను రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ పరిశీలించారు. వర్షం కారణంగా పంటలకు జరిగిన నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న అరటి తోటలు, పంట పొలాలను స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమకు జరిగిన పంట నష్టాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భరోసా ఇచ్చారు. పంట నష్టం వివరాలను అధికారుల ద్వారా సేకరించి, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నిత్యపూజయ్యా.. నీ కోనకు దారి ఏదయ్యా..?

● రోడ్డుకు మరమ్మతులు లేక భక్తుల ఇక్కట్లు.. ● అపరిశుభ్రంగా మంచినీటి గుండాలు



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబరు 06:-మండలంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన ప్రముఖ శైవక్షేత్రం శ్రీ నిత్యపూజ కోనలో భక్తులకు కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని శివభక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా రూ.17 లక్షలకు పైగా హుండీ ఆదాయం వస్తున్నప్పటికీ క్షేత్రంలో మౌలిక వసతుల కల్పనపై ఎండోమెంట్ అధికారులు, ఆలయ నిర్వాహకులు తగిన శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. నిత్యపూజ కోనకు వెళ్లే సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి వర్షాలకు దెబ్బతిని పలుచోట్ల కోతకు గురైందని, మరమ్మతులు చేపట్టక పోవడంతో వాహనాలపై వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే భక్తులు ఎంతో ప్రీతిగా వినియోగించే మంచినీటి గుండాలు అపరిశుభ్రంగా మారినా శుభ్రపరిచే చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిత్యపూజ కోనకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టడంతో పాటు మంచినీటి గుండాలను శుభ్రం చేసి భక్తులకు కనీస వసతులు కల్పించాలని శివభక్తులు కోరారు. లంకమల అభయారణ్యంలో వెలసిన ఈ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



వేంపల్లె రైతు బజార్‌లో అక్రమ వసూళ్లు..తక్షణమే చర్యలు తీసుకోవాలి

● కాంగ్రెస్ పార్టీ డిమాండ్



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 06:-అటు రైతులకు,ఇటు వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు బజార్లు ఆశించిన లక్ష్యాన్ని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమవుతున్నాయని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం వేంపల్లె కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక రైతు బజార్‌ను సందర్శించి, క్షేత్రస్థాయిలో రైతులు, వినియోగదారులు, చిరు వ్యాపారుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తెల్లవారుజాము ఒంటి గంటకే ఎంతో శ్రమకోర్చి, ఆటోలు మరియు ఇతర వాహనాల్లో తాము పండించిన పంటను రైతు బజార్‌కు తీసుకువస్తుంటే, వేలం పాట పాడిన కాంట్రాక్టర్లు వారి వద్ద నుండి అక్రమంగా గేటు ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు.ఒక్కో మూటపై రూ.40 చొప్పున వసూలు చేస్తున్నారు.ఒక్కో టమోటా బాక్స్‌పై రూ. 20 వసూలు చేస్తున్నారు. చిరు వ్యాపారుల వద్ద నుండి కాంట్రాక్టర్ చిన్న రూమ్‌కు నెలకు రూ. 3,000, గది ముందర బల్లల పై వ్యాపారం చేసుకునేందుకు రోజుకు రూ. 300 చొప్పున అక్రమంగా గుంజుతున్నారు.ఈ రకమైన దోపిడీ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆ భారం వినియోగదారులపై పడి నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు బజార్ కాంట్రాక్టర్లకు మేలు చేసేలా ఉండే తప్ప, పేద రైతులు, వినియోగదారులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని విమర్శించారు. ఈ విషయంపై సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని డిమాండ్ చేశారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ల దోపిడీ నుండి రైతులను, చిరు వ్యాపారులను, అలాగే అధిక ధరల నుండి వినియోగదారులను కాపాడాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమృద్ధిగా వర్షాలు కురవాలని వైదిక పూజలు



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 06:-రైతు క్షేమం ప్రజల సుఖ సంతోషాలే లక్ష్యంగా వరుణ దేవుడిని ప్రార్థిస్తూ రైల్వే కోడూరు శ్రీ భుజంగేశ్వర స్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వరుణ యాగం, వరుణ జపం, సహస్ర ఘటాభిషేకం వంటి ప్రత్యేక వైదిక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పవిత్ర పూజా కార్యక్రమాల్లో రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ బాధ్యులు, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, భార్య ముక్కా వరలక్ష్మి, యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు పుష్కలంగా పండాలి, రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కాలి, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి అని శ్రీ భుజంగేశ్వర స్వామివారిని భక్తి పూర్వకంగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, చైర్మన్ జయప్రకాశ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు, ప్రజలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థినికి ఆపన్నహస్తం



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 06:-మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్‌కు చెందిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఆలూరు లక్ష్మీ శైలజకు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సమేరిటన్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. విద్యార్థిని చదువుకు అవసరమైన ఫీజు నిమిత్తం రూ.2,000లను ట్రస్ట్ తరఫున అందించింది. ఈ మొత్తాన్ని మన ఊరికోసం స్వచ్ఛంద సంస్థ సభ్యులు అవ్వారు రవిశంకర్, పుత్తా సుధీర్ రాయల్ మంగళవారం శైలజ చదువుతున్న ఎస్‌కేఎం కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ సురేష్‌కు అందజేశారు. అనంతరం విద్యార్థిని చదువు, మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ, స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలను అభినందించారు. విద్యార్థినికి తమ కళాశాల తరఫున పుస్తకాలు, ఇతర విద్యా రుసుములు లేకుండా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.

శివాలయంలో ఘనంగా వరుణయాగం,వరుణ జపం



కడప మన జనప్రగతి అక్టోబర్ 06:-కడప నగరంలోని ప్రసిద్ధ మృత్యుంజయకుంట శివాలయంలో లోక కల్యాణార్థం, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగుండాలని కోరుతూ అర్చకులు ప్రత్యేక వరుణయాగం, వరుణ జపం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యురాలు మాధవీరెడ్డి, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, కడప జిల్లా ప్రజలు, రైతాంగం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, టీడీపీ నాయకులు చిట్టిబోయిన సుబ్బరాయుడు యాదవ్, లోమడ చంద్రమోహన్‌రెడ్డి, భోనం శిలాస్, పనిభూషణ్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో గాలివాన బీభత్సం

● 30 హెక్టార్లలో నేలకొరిగిన అరటి పంట..రూ.30 లక్షలకు పైగా నష్టం



లింగాల మన జనప్రగతి అక్టోబర్ 06:-లింగాల మండల పరిధిలోని కామసముద్రం, దొండ్లవాగు, ఇంటేపల్లి గ్రామాల్లో సోమవారం సాయంత్రం వీచిన బలమైన గాలులు, అకాల వర్షానికి అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 30 హెక్టార్లలో అరటి తోటలు నేలకొరిగినట్లు ఉద్యానవన శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.ఓవైపు వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో చేతికొచ్చిన అరటి పంట గాలివానకు నేలమట్టం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు అప్పులు చేసి పంట సాగు చేశామని, ఒక్కసారిగా నష్టం వాటిల్లడంతో తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరారు.**పంటలను పరిశీలించిన ఉద్యానవన శాఖ అధికారి** గాలివానకు దెబ్బతిన్న అరటి తోటలను మంగళవారం పులివెందుల ఉద్యానవన శాఖ అధికారి దీప తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. కామసముద్రం, ఇంటేపల్లి, దొండ్లవాగు ప్రాంతాల్లో సుమారు 30 హెక్టార్లలో అరటి పంట దెబ్బతిన్నట్లు గుర్తించామని, నష్టం విలువ రూ.30 లక్షలకు పైగా ఉండవచ్చని తెలిపారు.పంట నష్టంపై నివేదికను సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారి దీప తెలిపారు. బాధిత రైతులకు ప్రభుత్వం నుంచి వీలైనంత త్వరగా నష్టపరిహారం అందేలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

ఉలిమెళ్ల కాలువ వద్ద అదుపుతప్పి బోల్తాపడ్డ కారు..వ్యక్తి సురక్షితం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 06:పులివెందులకు చెందిన గొర్ల మహేంద్ర యాదవ్ రోడ్డు ప్రమాదం నుంచి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మహేంద్ర యాదవ్ వ్యక్తిగత పని నిమిత్తం పులివెందుల నుంచి వేముల మండలం కొండ్రెడ్డిపల్లెకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలోని ఉలిమెళ్ల కాలువ వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా రోడ్డుపైకి కుక్క అడ్డుగా వచ్చింది.దానిని తప్పించబోయే క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది.ప్రమాద సమయంలో వాహనం తక్కువ వేగంతో ఉండటంతో ఎయిర్‌బ్యాగ్‌లు,ఇతర రక్షణలతో మహేంద్ర యాదవ్‌కు ఎలాంటి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడ్డారు. పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు,కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకు న్నారు .ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, వాహనదారులు వెంటనే అక్కడికి చేరుకుని ఆయనను బయటకు తీసుకొచ్చారు.ఈ ఘటనతో ఉలిమెళ్ల కాలువ సమీపంలో కాసేపు కలకలం రేగింది.

బసవతారకం క్యాన్సర్ మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన బీటెక్ రవి





సింహాద్రిపురం మన జనప్రగతి అక్టోబర్ 06: సింహాద్రిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ & మెగా మెడికల్ క్యాంప్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్సీ,పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి ప్రారంభించారు.బసవతారకం ఆసుపత్రి నిపుణులైన వైద్యులు,వైద్య సిబ్బందితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని మొదలుపెట్టారు.ఈ సందర్భంగా ఆయన క్యాంప్‌లో ఏర్పాటు చేసిన అధునాతన వైద్య పరీక్షల విభాగాలు,ల్యాబ్ సదుపాయాలను స్వయంగా పరిశీలించారు.అనంతరం వైద్యులతో మాట్లాడి అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పరీక్షల కోసం విచ్చేసిన స్థానిక ప్రజలతో మాట్లాడి,వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటూ వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని బసవతారకం ఆసుపత్రి ద్వారా ఈ ప్రత్యేక క్యాంప్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు.క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసుకోవచ్చని, సింహాద్రిపురం మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వేంపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ అజ్జగుట్టు రఘునాథరెడ్డి,తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి,పులివెందుల నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ మారెడ్డి భరత్ రెడ్డి,సింహాద్రిపురం మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి,నాయకులు పుప్పాల శ్రీధర్ రెడ్డితో పాటు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వైద్య బృందం,స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అయోడిన్ లోప రుగ్మతల నివారణ



బద్వేలు మన జనప్రగతి అక్టోబర్ 06:- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోటవీధి పరిధిలోని గర్ల్స్ స్కూల్లో 90 మంది విద్యార్థి విద్యార్థులకు థైరాయిడ్ స్క్రీనింగ్ చేసి 9 మంది పిల్లలకు యూరిన్ శాంపిల్ 18 ఇండ్లలో సాల్ట్ శాంపుల్ తీసుకోవడం జరిగింది. అయోడిన్ లోప రుగ్మతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాము. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ శశివర్ధన్ రెడ్డి మెడికల్ ఆఫీసర్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు అయోడిన్ ప్రాముఖ్యతను అయోడిన్ లోపం వల్ల కలిగే సమస్యలు మరియు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా అయోడిన్ కలిగిన ఉప్పును రోజువారి ఆహారంలో ఉపయోగించడం గురించి వివరించారు అయోడిన్ లోపం వల్ల గాయిటర్ అనగా గొంతు కింద థైరాయిడ్ గ్రంధి వాపు పిల్లల శారీరిక మరియు మానసిక సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు రావచ్చుముఖ్య ఉద్దేశం అయోడిన్ లోపాన్ని నివారించడానికి ప్రతిరోజు అయోడైజెడ్ ఉప్పును ఉపయోగించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్.శ్రీ రామయ్య,ఏఎన్ఎం స్వాతి, ఆశాలు అనిత,రాములమ్మ,స్కూల్ టీచర్స్,పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జన్మదిన సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

● వైద్య శిబిరంలో పాల్గొన్న బిజెపి నేతలు



పోరుమామిళ్ల మన జనప్రగతి అక్టోబర్ 06:-ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా పట్టణంలోని సచివాలయం -2 వద్ద వైద్య అధికారి భార్గవి ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి కడప జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి, సేవా సంకల్ప అభియాన్ బద్వేల్ నియోజకవర్గ కన్వీనర్ మున్నెల్లి చిన్న గురయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న గురయ్య మాట్లాడుతూ...ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన సేవా సంకల్ప అభియాన్ వైద్య శిబిరంలో ప్రజలకు సేవ చేసే అవకాశం నాకు రావడం చాలా ఆనందంగావుంది అన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోకూడా వైద్యులు మనందరికీ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఇలాంటి వైద్యులకు మనం ఎంతో రుణపడి ఉన్నాం అని చిన్న గురయ్య అన్నారు. వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు కూడా నిర్వహించి మందులు అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు వంక దారి జయరామ్, బిజెపి యువనాయకులు భరత్, బిజేపి కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత భరోసా

● 70 మంది లబ్ధిదారులకు రూ.45.38 లక్షల ● సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ ● పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం ● ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 06:పేద ప్రజలకు వైద్య అత్యవసర పరిస్థితులు, అనుకోని ఆర్థిక ఇబ్బందులు భారంగా మారకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.పులివెందుల పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 70 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.45.38 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలు, ప్రమాదాల బారిన పడి ఆస్పత్రి ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడే కుటుంబాలను ఆదుకోవడంలో సీఎం సహాయ నిధి సంజీవనిలా పనిచేస్తోందని తెలిపారు. ప్రజల కష్టాల్లో ప్రభుత్వం తోడుగా ఉంటుందనే నమ్మకాన్ని ఈ పథకం మరింత బలోపేతం చేస్తోందని చెప్పారు.తమ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి భారీ ఆర్థిక సహాయం అందడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ,సహకరించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్నకు ఘనంగా వర్ధంతి నివాళులు



బద్వేలు మన జనప్రగతి అక్టోబర్ 07:-పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో సంస్థ ఎండీ బండారు రవి ఆధ్వర్యంలో రేనాటి వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ సంస్థ ఫౌండర్, నేషనల్ చైర్మన్ జి.పి. నరసింహులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం కోసం ఎందరో సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి జయంతులు, వర్ధంతులను గుర్తు చేసుకుని నివాళులర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.1846లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి వడ్డే ఓబన్న పోరాటం చేశారని తెలిపారు. వడ్డెర, బోయ, చెంచు తెగలకు చెందిన సుమారు 2 వేల మందితో సైన్యాన్ని ఏర్పాటు చేసి సైన్యాధ్యక్షుడిగా వ్యవహరించారని పేర్కొన్నారు. 1857 సిపాయి తిరుగుబాటుకు ముందే దక్షిణ భారతదేశంలో జరిగిన తొలి స్వాతంత్ర్య పోరాటాల్లో ఇది ఒకటని వివరించారు.పేరుసోముల కొండ ప్రాంతంలో బ్రిటిష్ దళాలతో జరిగిన పోరాటంలో 1846 అక్టోబర్ 6న వడ్డే ఓబన్న వీరమరణం పొందినట్లు పలు చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయని తెలిపారు. ఆయన సేవలను గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025 నుంచి జనవరి 11న వడ్డే ఓబన్న జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహించడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్.వి. రమణ, డేరంగుల కృష్ణ, వేముల శ్రీనివాసులు, రామ్మోహన్, కోటేశ్వరరావు, ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది బి. శివ, బి. రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్,జాయింట్ కలెక్టర్‌ను కలిసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్

● గ్రంథాలయ సెస్ నిధులు త్వరగా విడుదల చేయాలని వినతి





కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 06:-గ్రంథాలయాలకు సంబంధించిన సెస్ నిధులను త్వరితగతిన విడుదల చేసి, గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ (సాయిబాబు రాజు) కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.గ్రంథాలయాల నిర్వహణ, అభివృద్ధికి సెస్ నిధులు కీలకమని, నిధులు విడుదలైతే పాఠకులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని చైర్మన్ తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి అన్ని విధాల సహకరించాలని అధికారులను కోరారు.చైర్మన్ వెంట గ్రంథాలయ కార్యదర్శి కే.జే.ఎల్. కుమారి, ఉప గ్రంథాలయ అధికారి కిషోర్, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.


భూపతిరాజు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 06:-ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు ఈశ్వర్ రాజు వర్మ (సాయిబాబు రాజు) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా గ్రంథాలయ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, ఇతరులు కలిపి సుమారు 300 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ప్రముఖ వైద్యులు శిబిరంలో పాల్గొని కంటి, దంత తదితర ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా భూపతిరాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే.జే.ఎల్.ఎస్. కుమారి, ఉప గ్రంథాలయ అధికారి కే. కిషోర్, సీనియర్ అసిస్టెంట్ ఎం. శ్రావ్య, సాయి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

● మున్సిపల్ కమిషనర్ శివ తనూజ ● పెద్దరంగాపురంలో త్వరితగతిన కొత్త నీటి మోటారు ఏర్పాటు



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 06:పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతనిస్తామని మున్సిపల్ కమిషనర్ శివ తనూజ స్పష్టం చేశారు.పురపాలక సంఘం పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో తాగునీటి సరఫరా చేసే మోటారు చెడిపోవడంతో స్థానికంగా నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఈ విషయాన్ని గుర్తించిన కమిషనర్ వెంటనే స్పందించి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కమిషనర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన మున్సిపల్ సిబ్బంది,యుద్ధప్రాతిపదికన పాత మోటారు స్థానంలో కొత్త మోటారును బిగించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. సమస్య తీవ్రతను గుర్తించి సత్వరమే స్పందించి పరిష్కరించిన మున్సిపల్ కమిషనర్ శివ తనూజతో పాటు మున్సిపల్ సిబ్బందికి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసిన సుబ్బరాజు



ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 06:-తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియో జకవర్గంలోని బొమ్మ వరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మల రాజు పిచ్చి రాజు కుమారుడు సుబ్బరాజు విజయవాడలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సుబ్బరాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైల్వేకోడూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న సహాయం, ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలు, రహదారులు, రవాణా సౌకర్యాల మెరుగుదలతో పాటు పలు రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో రైల్వేకోడూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పులివెందులలో హైటెక్ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ

- పూలంగళ్ల కూడలిలో ఆధునికీకరణ పనులు ప్రారంభం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 06: పులివెందుల పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ,భద్రత లక్ష్యంగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.నిత్యం రద్దీగా ఉండే పూలంగళ్ల ప్రాంతంలో తొలి దశలో సిగ్నల్ వ్యవస్థను మరింత ఆధునీకరించే పనులు ప్రారంభమయ్యాయి.పట్టణంలో ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికట్టడంతో పాటు వాహనదారుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు.దశలవారీగా పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టి, అటు రవాణా నియంత్రణను,ఇటు భద్రతా పర్యవేక్షణను పటిష్టం చేయనున్నారు.మరోవైపు పట్టణ సమీపంలో నిర్మాణంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్, బ్రౌన్ ఫీల్డ్ రహదారులు త్వరలోనే అందుబాటులోకి రానుండటంతో భారీ వాహనాల రాకపోకలు బైపాస్ మీదుగా మళ్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దోమల నివారణకు ఫాగింగ్.. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



బొమ్మనహాల్ మన జనప్రగతి అక్టోబర్ 06:- హరేసముద్రం గ్రామంలో దోమల నివారణకు పంచాయతీ ఆధ్వర్యంలో ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించారు,గ్రామంలోని వీధులు,దోమలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఫాగింగ్ చేయించి దోమల వ్యాప్తిని అరికట్టే చర్యలు చేపట్టారు,ఈ సందర్భంగా గ్రామస్థులకు పరిసరాల పరిశుభ్రత,వ్యక్తిగత ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు,ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,చెత్తాచెదారం పేరుకుపోకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు,ముఖ్యంగా రాత్రి సమయంలో దోమతెరలు తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు, పంచాయతీ సెక్రటరీ రాధాకృష్ణ, ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్, గ్రామపెద్దలు పల్లె తిప్పేస్వామి, విజయకుమార్,గవప్ప, రామకృష్ణ,నటరాజ,సంజప్ప తదితరులు పాల్గొన్నారు.

కడప జిల్లాను వణికిస్తున్న 'సూపర్ ఎల్‌నినో' కరువు

- శ్రీశైలం నీటిని వెంటనే జిల్లా రిజర్వాయర్లకు విడుదల చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 06: కడప జిల్లా ప్రస్తుతం తీవ్రమైన 'సూపర్ ఎల్‌నినో' కరువు కోరల్లో చిక్కుకుపోయిందని, జిల్లాలోని అన్ని (40) మండలాలనూ వెంటనే కరువు మండలాలుగా ప్రకటించి ఆదుకోవాలని సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పులివెందులలోని సిఐటియు స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అడవుల్లోని అరుదైన ఖనిజాల కోసం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను విచ్చలవిడిగా నరికించి పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని చంద్రశేఖర్ మండిపడ్డారు. దీని పర్యవసానంగానే తీవ్రమైన 'ఎల్‌నినో' పరిస్థితులు తలెత్తి,కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర అనావృష్టి ఏర్పడుతోందని పేర్కొన్నారు.జిల్లాలో వర్షాలు లేక,బావులు,బోరుబావుల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలతో పాటు బత్తాయి, మామిడి వంటి పండ్ల తోటలు తీవ్ర ఎండలకు ఎండిపోయి రైతులు నిలువునా నష్టపోయారని తెలిపారు.వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు 'క్రాప్ హాలిడే' ప్రకటించే దుస్థితి దాపురించిందని,జీవనోపాధి కోసం పొట్టేళ్ల పెంపకం వంటి ఇతర పనుల వైపు మళ్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం కొన్ని మండలాలనే పరిగణనలోకి తీసుకుందని, తక్షణమే జిల్లాలోని మొత్తం 40 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి శ్రీశైలం జలాశయంలో అందుబాటులో ఉన్న నీటిని కడప జిల్లాలోని గండికోట,మైలవరం,బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులతో పాటు చిన్న,మధ్యతరహా రిజర్వాయర్లు,చెరువులకు వెంటనే విడుదల చేసి గ్రామాల్లో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడిని నివారించి,పశుగ్రాసం కొరత తీర్చేందుకు యుద్ధప్రాతిపదికన కరువు నివారణ చర్యలు చేపట్టాలి, ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం పులివెందుల కార్యదర్శి ఎస్.ఎ.గఫూర్,నాయకులు గజ్జల నారాయణరెడ్డి,రఘు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు..బాధ్యతలకు భరోసా..!

- గుర్తింపు కార్డుల పంపిణీ చేసిన శ్రీకాంత్ రెడ్డి



అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 06:-రాయచోటి మున్సిపాలిటీ లోని 33వ వార్డు పాత గొల్లపల్లెలో వైఎస్సార్‌సీపీలో వివిధ హోదాలు, పదవులు పొందిన వారికి పార్టీ గుర్తింపు కార్డులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పార్టీ పదవులు పొందిన వారికి గుర్తింపు కార్డులు అందజేసి, వారి బాధ్యతలను గుర్తు చేశారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు.గుర్తింపు కార్డు కేవలం గుర్తింపుకే కాకుండా పార్టీ అప్పగించిన బాధ్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. స్థానిక పార్టీ శ్రేణులు శ్రీకాంత్‌రెడ్డితో ఆత్మీయంగా మమేకమయ్యారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు రామాంజనేయులు, వీరనాగన్న, సురేంద్ర, మొహన్, పెద్ద ఆంజనేయులు, నాగేశ్వరి, లక్ష్మీదేవి, జీవిత, శివమ్మ, జ్యోతి, రమణమ్మ, శ్రీను, చిన్న ఆంజనేయులు, రెడ్డెయ్య, శివాంజి,పెద్ద రెడ్డెయ్య,పీర్ బాష,నరేష్,లతీఫ్,మల్లికార్జున, కిషోర్, శివయ్యతదితరులు పాల్గొన్నారు

పులివెందులలో మున్సిపల్ ఎన్నికలు,శాంతిభద్రతలపై ప్రజలకు పోలీసుల అవగాహన

- శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలి: అర్బన్ సీఐ పురుషోత్తం రాజు
- సైబర్ నేరాలు,రోడ్డు భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచన



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 06: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం స్థానిక ప్రజలతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.అర్బన్ సీఐ పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రానున్న మున్సిపల్ ఎన్నికల నియమావళి,సైబర్ భద్రత,మహిళా రక్షణ,రోడ్డు ప్రమాదాల నివారణ తదితర కీలక అంశాలపై ప్రజలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సీఐ పురుషోత్తం రాజు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పౌరులు బాధ్యతాయుతంగా మెలగాలని పిలుపునిచ్చారు.ప్రస్తుత రోజుల్లో పెరిగిపోతున్న సైబర్ మోసాలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని,గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్,మెసేజ్‌లకు స్పందించకూడదని హెచ్చరించారు.మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని,ఆపదలో ఉన్న మహిళలు ఏమాత్రం సంకోచించకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని,ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్,కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని ఆయన సూచించారు.పోలీసు సిబ్బందితో పాటు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్ మనోహర్ రెడ్డి పర్యటన

- పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో క్షేత్రస్థాయి పరిశీలన
- డ్రైనేజీ,రోడ్లు,యూజీడీ సమస్యలపై అధికారులకు కీలక ఆదేశాలు



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 06:పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు.మంగళవారం ఆయన పులివెందుల పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.పర్యటనలో భాగంగా భాకరాపురం,రెడ్డమ్మ వీధి,శ్రీరామ హాల్ రోడ్,ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన స్థానికులతో నేరుగా మాట్లాడారు.ఆయా ప్రాంతాల్లో ప్రధానంగా ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ),అంతర్గత రోడ్ల మరమ్మతులు,పారిశుద్ధ్య లోపాలు,మురుగునీటి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.వెంటనే స్పందించిన మనోహర్ రెడ్డి సంబంధిత పురపాలక అధికారులతో ఫోన్లో మాట్లాడి,సమస్యల పరిష్కారానికి తక్షణమే కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడైనా పౌర సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని, అధికారుల సమన్వయంతో వాటిని సత్వరమే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.ఈ పర్యటన కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్,సీనియర్ నాయకులు కోడి రమణ,మాజీ కౌన్సిలర్ పురుషోత్తం,మాజీ కో-ఆప్షన్ సభ్యులు చంద్రమౌళి, నాయకులు వెంగళ్ రాయుడు,లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



కలికిరి మన జనప్రగతి అక్టోబర్ 06:-ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని కలికిరిలో నూతన మండల యూనిట్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముని గోపాలకృష్ణ ఎలక్షన్ ఆఫీసర్‌గా, పి.సి. తిమ్మయ్య ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా సురేంద్రరెడ్డి, కార్యదర్శిగా శివరామిరెడ్డి, కోశాధికారిగా వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా గంగిరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా రమాదేవి, గిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.అనంతరం ఎన్నికల పరిశీలకుడు పి.సి. తిమ్మయ్య, ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ ముని గోపాలకృష్ణ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించారు.ప్రతి నెలా మండల యూనిట్ సమావేశం నిర్వహించాలని, మూడు నెలలకోసారి మదనపల్లెలో జరిగే జిల్లా సమావేశాలకు మండల అధ్యక్షుడు, కార్యదర్శి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. సభ్యుల నుంచి సేకరించే చందాలను పారదర్శకంగా బ్యాంకులో జమ చేసి, సంఘ సేవా కార్యక్రమాలకు వినియోగించాలని నిర్ణయించారు.మండల పరిధిలోని మరింత మంది సీనియర్ సిటిజన్లను సంఘంలో సభ్యులుగా చేర్చి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. నూతన మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల సంక్షేమంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముని గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సంఘం చేపడుతున్న కార్యక్రమాలకు మండల యూనిట్ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

- ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత
- లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ ప్రతినిధుల పిలుపు



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 06:-ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ అధ్యక్షుడు రామాంజనేయులు రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పి.ఎస్. హరినాథ్ రెడ్డి కోరారు. రాయచోటిలోని శశికర్ హాస్పిటల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పి.ఎస్. హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతి వ్యక్తి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న వారికి రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.రక్తదాత వి. రామాంజనేయులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితుడై రక్తదానం చేసినట్లు తెలిపారు. సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు.మాజీ అధ్యక్షుడు లయన్ పి. శివారెడ్డి మాట్లాడుతూ రాయచోటిలో ఆపదలో ఉన్న వారికి లయన్స్ క్లబ్ తరఫున ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లయన్ మనోహర్ రాజు, దీప బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విదేశీయుల బస వివరాలను తప్పనిసరిగా
ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 06:-కర్నూలు జిల్లా పరిధిలో విద్య, వైద్యం, పర్యాటకం, వ్యాపారం లేదా ఇతర అవసరాల నిమిత్తం వచ్చే విదేశీయులకు వసతి కల్పించే హోటళ్లు, రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లు, అద్దె ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రులు, హాస్టళ్లు, ఆశ్రమాలు, విద్యా సంస్థలు మరియు ఇతర ప్రాంగణాల యజమానులు లేదా బాధ్యులు విదేశీయుల బస వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ది ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం నిబంధనల ప్రకారం విదేశీయుల రాక, బస, నిష్క్రమణ వివరాలను బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ పోర్టల్‌లోని ఫారం-సి ద్వారా పూర్తి వివరాలతో 24 గంటల్లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అవసరమైన వివరాలను సంబంధిత ఎఫ్ఆర్ఆర్ఓ/ఎఫ్ఆర్ఓ కార్యాలయాలకు సమర్పించాల్సి ఉంటుంది.విదేశీయుల బస వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా సంబంధిత యజమానులు లేదా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా, జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందని తెలిపారు.జిల్లాకు వచ్చే విదేశీయులు చెల్లుబాటయ్యే పాస్‌పోర్టు, వీసా కలిగి ఉండాలని, భారతీయ చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు.విదేశాల్లో స్థిరపడిన ఓసీఐ కార్డుదారులు భారతదేశంలో ఎన్నికల్లో పోటీ చేయడం, ఓటు వేయడం లేదా వ్యవసాయ భూములను కొనుగోలు చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడకూడదని తెలిపారు.స్థానిక ప్రజలు తమ పరిసరాల్లో నివసిస్తున్న విదేశీయుల గురించి ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే పోలీసులకు టెలిఫోన్ లేదా ఈ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చని కర్నూలు ఎస్పీ సూచించారు. విదేశీయులకు వసతి కల్పించే హోటళ్లు, సంస్థలు, ఇళ్లు మరియు ఇతర ప్రాంగణాల యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు.

రోడ్లపై అడ్డంగా వాహనాలు నిలిపితే కఠిన చర్యలు: అర్బన్ ఎస్పీ సుభాహాన్

- **పులివెందులలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.500 నుండి రూ.2,000 వరకు జరిమానా**



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 06:పట్టణ పరిధిలోని ప్రధాన రహదారులపై వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపితే కఠిన చర్యలు తప్పవని పులివెందుల అర్బన్ ఎస్ఐ సుభాహాన్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి పట్టణంలోని ప్రధాన కూడళ్లు,రహదారులలో విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు.సరైన పత్రాలు (రికార్డులు) లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్లపై ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించేలా లేదా 'నో పార్కింగ్' ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే మోటారు వాహనాల చట్టం ప్రకారం రూ.500 నుండి రూ.2,000 వరకు జరిమానాతో పాటు టోయింగ్ ఛార్జీలు వసూలు చేస్తామని హెచ్చరించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని,ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా
కలిసిన వి.హరిప్రసాద్ రెడ్డి

- **నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై చర్చ**
- **భవిష్యత్ ప్రచార వ్యూహాలపై వైఎస్ జగన్ దిశానిర్దేశం**



పీలేరు మన జనప్రగతి అక్టోబర్ 06:-తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వి. హరిప్రసాద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, సచివాలయ ఉద్యోగుల అరెస్టులు, డీఎస్సీ విషయంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులను హరిప్రసాద్ రెడ్డి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నోటిఫికేషన్‌పై కూటమి ప్రభుత్వం స్పష్టత లేకుండా వ్యవహరిస్తోందని తెలిపారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ అమలుపై కూడా చర్చించారు.కూటమి ప్రభుత్వం నెరవేర్చని హామీలు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైఎస్ జగన్ సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ప్రచార వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు.

తొండూరు పీహెచ్‌సీలో సంకల్ప అభియాన్ కార్యక్రమం

- **ఉచిత వైద్య శిబిరంతో రోగులకు వైద్య సేవలు**
- **క్యాన్సర్,రక్తహీనత,బీపీ,షుగర్‌పై అవగాహన**



తొండూరు మన జనప్రగతి అక్టోబర్ 06:-మండల పరిధిలోని తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గవాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సంకల్ప అభియాన్2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులు, గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు అందించారు.రోగులకు అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు క్యాన్సర్, రక్తహీనత, బీపీ, షుగర్ నియంత్రణ, కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ మాసంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు ఆహార ప్రదర్శన ఏర్పాటు చేసి పోషకాహారంపై అవగాహన కల్పించారు. అవసరమైన మందులను అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ గవాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ నహీదా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి విజయ, పర్యవేక్షకురాలు షీభా, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఎమ్మెల్యే వరద విఫలం

- **కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ బాషా విమర్శలు**
- **ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్**



ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి అక్టోబర్ 06:-ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజా సమస్యలు, అభివృద్ధి అవసరాలను ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ బాషా ఆరోపించారు. సోమవారం ప్రొద్దుటూరులో జరిగిన జల్ జీవన్ మిషన్ 2.0అమరజీవి జలధార కార్యక్రమం 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న చందంగా జరిగిందని విమర్శించారు.మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు, నూతన కళాశాలలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, నూతన తాగునీటి పైప్‌లైన్, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, మెడికల్ కాలేజీ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే వీటిని పక్కనపెట్టి జల్ జీవన్ మిషన్ కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని అన్నారు.అమరజీవి జలధార కార్యక్రమానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టినప్పటికీ, కార్యక్రమ ప్రాంగణంలో ఆయన చిత్రపటం లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు ప్రొద్దుటూరుకు వచ్చినప్పుడు నియోజకవర్గ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు. ప్రజాధనంతో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా నిర్వహించడం తగదని విమర్శించారు.గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కొన్ని మాత్రమే కొనసాగుతున్నాయని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, మెడికల్ కాలేజీ వంటి కీలక పనులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే గత ప్రభుత్వం మంజూరు చేసిన 18 వేల ఇళ్ల పట్టాల పరిస్థితి, మూడు కాలనీల్లో మహిళల ఇళ్ల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోవడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం పూర్తయినప్పటికీ మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యేను ప్రశంసించడం కంటే వాస్తవంగా అభివృద్ధి పనులు జరిగితేనే ప్రజలకు ప్రయోజనం ఉంటుందని ఇర్ఫాన్ బాషా పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రొద్దుటూరు అభివృద్ధికి ఎవరు కృషి చేస్తున్నారో ప్రజలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు,
బాలింతలు,చిన్నారుల అభివృద్ధి

అంగన్వాడీ ఉత్సవ్‌లో బీజేపీ నేత డాక్టర్ పాలగిరి శ్రీనివాస్ కుమార్ రాజు

పోషకాహారంతో చిన్నారులు, తల్లుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 06:-అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాభివృద్ధికి కృషి చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని రాయచోటి నియోజకవర్గ బీజేపీ నేత డాక్టర్ పాలగిరి శ్రీనివాస్ కుమార్ రాజు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 7 వరకు అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మంగళవారం రాయచోటి పట్టణంలోని మార్కెట్‌లో ఉన్న ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో సుగుణ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాలగిరి శ్రీనివాస్ కుమార్ రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాలకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నాయని తెలిపారు.అంగన్వాడీ కేంద్రాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న టీచర్లను ఘనంగా సన్మానించారు. అలాగే గర్భిణులకు సీమంతం నిర్వహించారు. టీడీపీ నాయకులు గాజుల ఖాదరుబాషా, మహబూబ్ అలీ ఖాన్, బీజేపీ నాయకులు రేపన శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్. విద్యాధరి, కోఆర్డినేటర్ ఎస్. రామయ్య, ఎస్. వనజ, పట్టణ అధ్యక్షుడు జయచంద్రనాయుడు, మల్లికార్జున, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వీఆర్‌సీ గ్రౌండ్‌కు కొత్త కళ

- **ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్,**

స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు



నెల్లూరు, మన జనప్రగతి, అక్టోబర్ 6: వీఆర్‌సీ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్ల నిర్మాణ పనులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శంకుస్థాపన చేశారు. బాస్కెట్‌బాల్ కోర్టును ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని చెప్పారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 18 ప్రభుత్వ హైస్కూళ్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు.అనంతరం 14వ డివిజన్‌లోని పాఠశాలలను పరిశీలించారు. వీఆర్‌సీ గ్రౌండ్‌లో జెండా పోల్ ఏర్పాటుకు రూ.20 వేల విరాళం అందించిన డాక్టర్ పోకల రవిని అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.

14 నెలల్లో 100 కోట్ల 'స్త్రీ శక్తి' ప్రయాణాలు

- **మహిళా సాధికారతకు నిదర్శనం: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**



అమరావతి, మన జనప్రగతి, అక్టోబర్ 06:- ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్న 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభమైన 14 నెలల్లోనే 100 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని చేరుకోవడం చారిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని, ఇప్పటివరకు 100 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలకు సుమారు రూ.3,550 కోట్ల ప్రయాణ ఖర్చు ఆదా అయిందని తెలిపారు. ఈ ఆదా కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపారాలకు ఉపయోగపడుతోందన్నారు.గ్రామీణ ప్రాంతాల నుంచి విద్య, ఉపాధి, వైద్యం, ఇతర అవసరాల కోసం పట్టణాలకు వెళ్లే మహిళలకు ఈ పథకం ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు సురక్షిత ప్రయాణానికి దోహదపడుతోందని మంత్రి పేర్కొన్నారు.'స్త్రీ శక్తి' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, యాజమాన్యం, అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని మంత్రి అభినందించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

రహదారి పనులను వేగవంతం చేయాలి

- **రూ.34 కోట్లతో భీమిలి**
- **నర్సీపట్నం రోడ్డు విస్తరణ**



విశాఖ/భీమిలి, మన జనప్రగతి, అక్టోబర్ 06:- రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కీలకమైన భీమిలి-నర్సీపట్నం రహదారి విస్తరణ పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.రూ.34 కోట్లతో ప్రస్తుతం ఉన్న రెండు లైన్ల రహదారిని నాలుగు లైన్లుగా విస్తరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రూ.1.66 కోట్ల వ్యయంతో 7.34 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు.పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను, కాంట్రాక్టర్లను మంత్రి ఆదేశించారు. మిగిలిన పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. తనిఖీలో ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన
వీరయోధుడు వడ్డెర ఓబన్న

- వడ్డెర ఓబన్న త్యాగం భావితరాలకు ఆదర్శం
- వైస్సార్సీపీ రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షులు వి.వరప్రసాద్
- ఉలిమెల్ల రోడ్డులో ఘనంగా వర్ధంతి వేడుకలు



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 06:భారత స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన వీరత్వానికి ప్రతీక,త్యాగానికి ప్రతిరూపం వడ్డెర ఓబన్న అని పులివెందుల మున్సిపల్ మాజీ చైర్మన్,వైస్సార్సీపీ రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షులు వి.వరప్రసాద్ కొనియాడారు.స్థానిక ఉలిమెల్ల రోడ్డులో మంగళవారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డెర ఓబన్న వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన వడ్డెర ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.నాయకులు,కార్యకర్తలు "జోహార్ వీర వడ్డెర ఓబన్న" అంటూ నినదించారు.అనంతరం వరప్రసాద్ మాట్లాడుతూ ఆంగ్లేయుల ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యానికి సైన్యాధ్యక్షుడిగా పనిచేసి బ్రిటిష్ పాలకులను ముప్పుతిప్పలు పెట్టిన గొప్ప దేశభక్తుడు ఓబన్న అని అన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ఓబన్న ధైర్యసాహసాలు చిరస్మరణీయమని,నేటి తరం ఓబన్న ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు,స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ప్రగతికి బలిజలంతా ఏకం కావాలి

యువత,మహిళలు చైతన్యవంతం కావాలి

కడప సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి

కార్యక్రమ సమన్వయకర్త పసుపులేటి వెంకటేశ్వర్లు పిలుపు



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 06:-బలిజ సమాజం సామాజికంగా అభివృద్ధి చెందాలంటే సంఘీయులంతా ఐక్యంగా ఉండాలని కార్యక్రమ సమన్వయకర్త పసుపులేటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, మహిళలు చైతన్యవంతులై సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. మంగళవారం వేంపల్లె పట్టణంలోని బలిజ సంఘం కార్యాలయంలో సంఘీయులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘీయుల మధ్య ఐక్యతతోనే సంఘం మరింత బలోపేతమవుతుందని అన్నారు. బలిజ కుల సంక్షేమం, సామాజిక అభివృద్ధితో పాటు యువతలో చైతన్యం, రాజకీయ అవగాహన పెంపొందించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని కోరారు.గ్రేటర్ రాయలసీమ మహాబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కడప, అన్నమయ్య జిల్లాల బలిజ చైతన్య సదస్సును ఈనెల 25న ఆదివారం ఉదయం 10 గంటలకు కడపలోని మాధవి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘం బలోపేతం, బలిజల సంక్షేమం, యువతలో చైతన్యం, సామాజిక అభివృద్ధి అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు చెప్పారు.సదస్సుకు నంద్యాలకు చెందిన ఆర్‌జీఎం శాంతిరాం విద్యాసంస్థల చైర్మన్ మిద్దె శాంతిరాముడు ప్రధాన వక్తగా హాజరై బలిజ సంఘీయులకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. బలిజ సంఘ సభ్యులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో కడపకు తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.ఈ సమావేశంలో గ్రేటర్ రాయలసీమ అధ్యక్షుడు సమతం రాము, దేవసం గిరిబాబు, సుంకర రవిశంకర్, బండి ప్రసాద్, పల్కూరి అరవింద్, బెల్లంకొండ గోపి, హరీష్, వేంపల్లె బలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్తూరు రెడ్డయ్య, డా. రంగయ్య, అధ్యక్షుడు కటిక చంద్రశేఖర్, కమిటీ సభ్యులు డా. కోలా మారుతి ప్రసాద్, ఎద్దుల రామచంద్ర, డా. రాజారాం, కేపీ. వెంకట రమణ, దాసరి రవిశంకర్, హరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దసరా వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పోలీసుల అప్రమత్తత

- సిబ్బందికి పలు సూచనలు చేసిన వన్‌టౌన్ సీఐ కొండారెడ్డి



ప్రొద్దుటూరు, మన జనప్రగతి అక్టోబర్ 06:- రానున్న దసరా పండుగ వేడుకలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశించారు.ఎస్పీ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ టి.వి. కొండారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా వేడుకల నేపథ్యంలో చేపట్టాల్సిన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ దసరా వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యా రంగంలో జిల్లాను ముందంజలో నిలపాలి

- పదో తరగతి ఫలితాల మెరుగుదలకు మిషన్ మార్చి-2027 అమలు చేయాలి:

కలెక్టర్ నిశాంత్ కుమార్



మదనపల్లె, మన జనప్రగతి అక్టోబర్ 06:- జిల్లాలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు.పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో పాఠశాలల పనితీరు, విద్యార్థుల హాజరు, డ్రాపౌట్లు, మౌలిక వసతులు, పదో తరగతి ఫలితాలపై అధికారులతో సమీక్షించారు.మనబడి, నాడు-నేడు, పీఎం శ్రీ పాఠశాలలు, ఆడిటోరియంల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల పనులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మంజూరైన నిధులను నిబంధనల ప్రకారం సద్వినియోగం చేసి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరమ్మతు పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.జిల్లాలో పదో తరగతి ఫలితాల మెరుగుదలకు మిషన్ మార్చి-2027ను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల గైర్హాజరు, డ్రాపౌట్లకు కారణాలను గుర్తించి నివారించడంతో పాటు బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించిన కార్యక్రమాలను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష అధికారిణి అనురాధ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విధానాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలి

- వేముల మండల వైకాపా కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ



వేముల మన జనప్రగతి అక్టోబర్ 06:-కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వేముల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలే వైఎస్సార్‌సీపీకి ప్రధాన బలమని పేర్కొన్నారు.వేముల మండలంలోని దుగ్గన్నగారిపల్లి పంచాయతీ పరిధిలోని దుగ్గన్నగారిపల్లి, గుండ్లపల్లి గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంగళవారం సాయంత్రం ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.పాటిమీద శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం వద్ద జరిగిన కార్యక్రమంలో నాగేళ్ల సాంబశివారెడ్డి, మాజీ జడ్పీటీసీ కోకటం వెంకట బైయపిరెడ్డి, మాజీ పీబీసీ సభ్యులు మరక శివకృష్ణారెడ్డి పాల్గొని కార్యకర్తలకు ఐడీ కార్డులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల సేవలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత కల్పించడం పార్టీ బాధ్యత అన్నారు. కార్యకర్తలకు అందజేస్తున్న ఐడీ కార్డుతో పాటు రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేస్తూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వ విధానాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాగేళ్ల సాంబశివారెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త చురుగ్గా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రామాంజనే యులురెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, జల్లా శివారెడ్డి, రామకృష్ణారెడ్డి, వేమనారాయణరెడ్డి, చెన్నారెడ్డి, బ్రహ్మంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, చంద్రారెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు చేరువగా ప్రాథమిక వైద్య సేవలు

- మూడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్
- విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభం



మదనపల్లె, మన జనప్రగతి అక్టోబర్ 06 :- గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 267 నూతన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ నిశాంత్ కుమార్ అనంతరం అన్నమయ్య జిల్లాలో నిర్మించిన మూడు క్లినిక్ భవనాల శిలాఫలకాలను ఆవిష్కరించారు.గాలివీడు మండలం తూముకుంటలో రూ.16.50 లక్షలు, లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలో రూ.11 లక్షలు, పెద్దమండ్యం మండలం సత్తి ఓబన్నగారిపల్లిలో రూ.17.88 లక్షల అంచనా వ్యయంతో మొత్తం రూ.45.38 లక్షలతో ఈ భవనాలను నిర్మించినట్లు కలెక్టర్ తెలిపారు.గ్రామీణ ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే ప్రాథమిక వైద్య సేవలు అందించడమే వీటి లక్ష్యమన్నారు. క్లినిక్‌లలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల ద్వారా వైద్య సేవలు, మందులు, 14 రకాల ప్రాథమిక వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అవసరమైన రోగులను ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసే సదుపాయం ఉంటుందన్నారు.కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వై. శ్రీనివాసులు, డీపీఎంఓ డాక్టర్ బి. రమేష్‌బాబు, డీఎంఓ డాక్టర్ వెంకటరమణరెడ్డి, వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు

- ప్రతి 2,500 మందికి ఒక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్: మంత్రి సత్యకుమార్ యాదవ్



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 06:-గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను విస్తరిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.'ఆరోగ్యం పరమం ధనం' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 165 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను మంగళవారం గుడివాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా కడప జిల్లాలో దేవగుడి-2, బొమ్మేపల్లి, పెద్ద దండ్లూరు, దొరసానిపల్లి, చీమలపెంట గ్రామాల్లో ఐదు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. యుగంధర్ మాట్లాడుతూ ప్రతి 2,500 మంది జనాభాకు ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో 104 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు, 71 రకాల వైద్య పరికరాలతో సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. మాతా శిశు ఆరోగ్యం, టీకాలు, సంక్రమణ, అసంక్రమిత వ్యాధుల నివారణ తదితర 12 రకాల ఆరోగ్య సేవలు అందిస్తామని వివరించారు.పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ మద్దయ్య మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 40 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే ఐదు ప్రారంభించామని తెలిపారు. మిగిలిన 35 కేంద్రాలను డిసెంబర్ 2026 నాటికి అన్ని సౌకర్యాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174